గిరి ప్రదక్షిణ

గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్రం చర్యలు

ధర్తీ ఆబా జన్ జాతీయ

ఉత్కర్ష్ గ్రామ అభియాన్ వర్తింపు

విద్య, వైద్యం, జీవనోపాధుల మెరుగుకు శ్రీకారం

జిల్లాలో ఐదు గ్రామాల ఎంపిక..

సమస్యలు గుర్తిస్తున్న అధికారులు



7

సార్..! మా భూమి ఇప్పించండి

ఆర్డీఓ కాళ్లు పట్టుకున్న బాధితులు



గతంలో ఇచ్చిన పట్టా, ఆర్డీఓ కాళ్లు పట్టుకుంటున్న రైతు

7

మా మధ్య విభేదాల్లేవు..

చిచ్చుపెట్టాలని చూస్తే ఊరుకోను: బీకే



ప్రసంగిస్తున్న బీకే

సోమందేపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): 'నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో జడ్పీ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, ఎంపీగా పలు పదవుల్లో ప్రజలకు సేవలు అందించాను. రామచంద్రా రెడ్డి, పరిటాల రవీంద్ర, పరిటాల సునీతతో కలిసి పనిచేశాను. ఎక్కడా చిన్న విభేదాలు కూడా లేవు. ఇప్పుడెందుకో మాయరోగం.. మంత్రి సవితకు, నాకు మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. వారి పప్పులు ఉడకవు, చూస్తూ ఊరుకోను' అంటూ శనివారం హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమందేపల్లి మండలం అక్కమ్మగార్లకొండవద్ద భగీరథ కల్యాణమండపం భూమిపూజకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలో కొందరు స్వార్థపరులు మంత్రి సవిత వర్గం, బీకే వర్గాలు అంటూ విభజించి వివాదాలు సృష్టిస్తున్నారని అన్నారు. సవితకు, తనకు ఎలాంటి విభేదాలు లేవన్నారు. ఇద్దరం ప్రభుత్వ ప్రతినిధులుగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. గతంలో నాయకుల మధ్య విభేదాల కారణంగా కల్యాణమండపం వివాదం చెలరేగిందన్నారు. తాను మంత్రి సవితతో కలిసి వివాదాన్ని పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కొత్తపల్లి క్రాస్‌వద్ద ఉన్న భగీరథ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్లో భాగంగా సగర కులస్థుల కల్యాణమండపం నిర్మాణానికి రూ.80లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు.

సగరులవల్లే మంత్రినయ్యా: సవిత



మాట్లాడుతున్న సవిత

సగర కులస్థుల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రినయ్యానని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. భగీరథ కల్యాణమండపం భూమిపూజకు హాజరైన ఆమె కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. ఎన్టీరామారావు చలవ వల్లే బీసీ కులాలవారు రాజకీయంగా రాణిస్తున్నారని అన్నారు. గతంలో తన తండ్రి రామచంద్రారెడ్డిని సగర కులస్థులే గెలిపించారన్నారు. సోమందేపల్లి మండలంలో రూ.5 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. తాగునీటి కోసం నాలుగు బోర్లువేసి పైప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. సోమందేపల్లి చెరువు ఆయకట్టు 300ఎకరాలకు హంద్రీనీవా ద్వారా నీరు అందించామన్నారు. బీసీలకు సబ్సిడీ రుణాలు అందించి స్వయం ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో బీసీ భవన్‌లను నిర్మిస్తామన్నారు. సోమందేపల్లికి జూనియర్, ఐటీఐ కళాశాలలు మంజూరు చేశామన్నారు. భగీరథ కల్యాణమండపానికి సీసీరోడ్డు వేయడంతో పాటు సొంత నిధులు రూ.5లక్షల 116ను ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉప్పర సగర సంఘం నాయకులు రామచంద్ర, బోర్‌వెల్ గోపాల్, చిన్నబాబయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రుల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎంఈఓ ఆంజనేయులునాయక్, ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మంత్రి సవిత కరచాలనం



కోడూరులో విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

అక్షరాల సంక్రాంతి

ఆహ్లాదకర వాతావరణంలో మెగా పీటీఎం

2,061 పాఠశాలల్లో ఉత్సాహంగా వేడుకలు... తల్లిదండ్రులు, నాయకులు, అధికారుల రాకతో సందడి

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం పండుగను తలపించింది. జిల్లావ్యాప్తంగా 2,061 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. నాణ్యమైన విద్యను అందించే దిశగా కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఈ వేడుకలలో పాల్గొన్నారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల పురోగతికి పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి.. బహుమతులను అందజేశారు. విద్యార్థుల ప్రగతిని వివరించి, తల్లిదండ్రుల సమక్షంలో ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఈ వేడుకలు సంక్రాంతి సంబరాలను తలపించాయి.

(వివరాలు 6లో)

తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి

- కలెక్టర్ చేతన్

చిలమత్తూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని కలెక్టర్ చేతన్ సూచించారు. కోడూరు, కొడికొండ జడ్పీ పాఠశాలల్లో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. వైజ్ఞానిక ప్రదర్శలను, చిత్రకళలను చూసి విద్యార్థులను అభినందించారు. ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించి, తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థుల చదువు, నడవడికపై నిఘా పెట్టాలని సూచించారు. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరిస్తే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. విద్యార్థులకు సెల్‌ఫోన్‌లు అవసరం లేదని, వాటి ద్వారా భవిష్యత్తు నాశనమౌతుందని హెచ్చరించారు. టీడీపీ నాయకులు రంగారెడ్డి, బేకరీ గంగాధర్, సోమశేఖర్ తదితరలు పాఠశాల సమస్యలను కలెక్టర్‌కి వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణయ్య, ఎస్ఎస్ఏ ఏఎంఓ అబ్దుల్ మాలిక్ తదితరలు పాల్గొన్నారు.



'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్పీ, డీఎస్పీ తదితరులు

డ్రగ్స్‌పై ఉక్కుపాదం: ఎస్పీ రత్న

ధర్మవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపుదామని ఎస్పీ వి.రత్న పిలుపు నిచ్చారు. పట్టణంలోని బీఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకలలో ఆమె పాల్గొన్నారు. స్థానిక పోలీసులు ఏర్పాటు చేసిన డ్రగ్స్, సైబర్ నేరాల పోస్టర్లను ఆవిష్కరించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. విద్యార్థులు పెడతోవ పట్టకుండా కాపాడుకోవాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణ కోసం కఠిన నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. ఈగల్ పేరిట యాంటి డ్రగ్స్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందని అన్నారు. గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం గురించి తెలిస్తే టోల్ ఫ్రీ నంబరు 1976కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఎంఈఓలు గోపాల్‌నాయక్, రాజేశ్వరి, హెచ్ఎం ఉమాపతి, ఎస్పీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, టూటౌన్ సీఐ రెడ్డప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ వి.రత్న

అటకెక్కిన ఫాగింగ్ యంత్రాలు

విజృంభిస్తున్న దోమలు... విష జ్వరాల బారిన జనం

కొత్తచెరువు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు, వంకలు, చెరువుల్లోకి నీరు చేరింది. దీంతో ఎక్కడ చూసినా గుంతలు, మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఫలితంగా దోమల ఉధృతి అధికంగా ఉంది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా దోమల బెడదతో ప్రజలు బెంబేలెత్తున్నారు. దోమకాటు వల్ల ప్రజలు విషజ్వరాల బారిన పడుతూ ఆసుపత్రుల పాలవుతున్నారు. డెంగీ, టైఫాయిడ్ వంటి జ్వరాలు పెరిగిపోయాయి. పంచాయతీ అధికారులు దోమల నివారణకు ఫాగింగ్ చేయడంలో విఫమవుతున్నారు. ఫాగింగ్ యంత్రాల నిర్వహణ భారం పెరుగుతుండటంతో నిధులు లేక అవి మూలనపడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కింద ఒక్కొక్క ఫాగింగ్ మిషన్‌ను రూ.45వేల నుంచి రూ.50వేలతో వెచ్చించి ప్రతి పంచాయతీకి సరఫరా చేసింది. వాటిని ఆపరేట్ చేయడంపై శిక్షణ ఇవ్వక పోవడంతో అవి మూలనపడ్డాయి. ఒక ఫాగింగ్ మిషన్ ద్వారా దోమల మందును పిచికారి చేయాలంటే 5 లీటర్ల డీజిల్‌లోకి మిలాథిన్ 200 గ్రాములు, అబిట్ 200 మిల్లీ గ్రాములు ఉపయోగించాల్సి ఉంటుంది. మిలాథిన్ అబిట్ లీటరు రూ.2వేలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మొత్తం కలిపి దోమల నివారణకు ఫాగింగ్ చేయాలంటే రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చు అవుతుంది. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించాలంటే ఖర్చుతో కూడిన పని. ప్రతి రెండు నెలలకు ఒకసారి ఉపయోగించుకోకపోతే ఫాగింగ్ మిషన్లు పనిచేయవు. శ్రీసత్యసాయి జిల్లాలోని 467 పంచాయతీలకు గాను 441 పంచాయతీలకు యంత్రాలను అందించింది. గత ప్రభుత్వం పంచాయతీల నిధులను దారి మళ్లించడంతో ఫాగింగ్ యంత్రాలు అట్టపెట్టెలకే పరిమితమయ్యాయి.

అవగాహన కల్పిస్తాం: సమత, డీపీఓ

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఫాగింగ్ యంత్రాల వాడకంపై అవగాహన కల్పించి వినియోగంలోకి తీసుకువస్తాం.దోమల నివారనకు చర్యలు చేపడతాం.ఎక్కడా పారిశుధ్య సమస్య తలెత్తకుండా ఇప్పటికే ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.



కొత్తచెరువు పంచాయతీ కార్యాలయంలో పనిచేయని ఫాగింగ్ మిషన్

రేషన్ కోసం పడిగాపులు

తెల్లవారుజాము నుంచే క్యూ

సీరియల్‌గా సంచులు

బియ్యం కోసం ఉపాధిని కోల్పోతున్న బడుగులు

అధికారుల నిర్లక్ష్యంతో లబ్ధిదారులకు తిప్పలు



ఇందిరమ్మ కాలనీలోని రేషన్ షాపు వద్ద క్యూలో వేసిన సంచులు

ధర్మవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల కోసం లబ్ధిదారులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. తెల్లవారు జామున 3 గంటల నుంచే రేషన్ షాపు వద్దకు వెళ్లి క్యూలో ఉంటే తప్పా తమ సంచిలోకి బియ్యం పడని పరిస్థితి ధర్మవరంలో నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం, స్టోర్ డీలర్ల నిర్వాహకం వల్ల లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. ఈ కష్టాలన్నీ ధర్మవరం పట్టణ శివారు ప్రాంతమైన ఇందిరమ్మకాలనీలో కనిపిస్తున్నాయి.

చౌకధరల దుకాణం ద్వారా బియ్యం, ఇతర సరుకులు ప్రతినెల 1వ తేదీ నుంచి 15వతేదీలోగా అందించాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ నిబంధనలను కొందరు డీలర్లు తుంగలోకి తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో సమస్య దాపురించింది. ప్రస్తుతం స్టోర్‌లో సరుకులు ఎప్పుడు ఇస్తారో, ఎప్పుడు నో స్టాక్ బోర్డు పెడతారో తెలియని పరిస్థితి ధర్మవరంలో పలు చోట్ల చోటు చేసుకుంది. ప్రధానంగా శివారు ప్రాంతాలైన ఇందిరమ్మకాలనీ, ఎల్-1,ఎల్-2,ఎల్-3,ఎల్-4 ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రస్థాయిలో ఉంది. రేషన్ కోసం కూలి పనులు వదులుకుని తెల్లవారుజామున నుంచే దుకాణం వద్ద సంచులను సీరియల్‌గా పెట్టుకుని ఎదురు చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. 7వతేదీకి 40 శాతం మందికి మాత్రమే పంపిణీ చేయగలిగారంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది.

ఈ అగచాట్లు ఎప్పుడూ చూడలేదు..

రేషన్ కోసం వెళ్లి నెట్ వర్క్ సమస్య వల్ల ఒక గంట ఆలస్యంగా నైనా తీసుకెళ్లామే తప్పా.. ఇలా తెల్లవారుజామునే దుకాణానికి వెళ్తే తప్పా బియ్యం దక్కించుకునే పరిస్థితి ఇప్పటి వరకు తాము ఎప్పుడు చూడలేదని ఇందిరమ్మకాలనీ, ఎల్-4 కాలనీకి చెందిన పలువురు గగ్గోలు పెడుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్న తమవంటి పేద కుటుంబాలకు ఇవేమి కష్టాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం సంచిలో పడే వరకూ నమ్మకం లేకుండా పోయిందని అంటున్నారు. అధికారులుకానీ, పాలకులు తమ గోడును ఆలకించి సకాలంలో రేషన్ అందించాలని పేదలు కోరుతున్నారు.


ఉపాధిని కోల్పోతున్నాం



స్టోర్ బియ్యం కోసం ఒక రోజు ఉపాధిని కోల్పోతున్నాం. తెల్లవారుజామున నుంచే క్యూలో ఉంటున్నాం. మూడు తరువాత వెళ్దామనుకుంటే బియ్యం అయిపోయాయని డీలర్లు చెబుతున్నారు. బియ్యం తెచ్చుకోకుండా మూడు నెలలు దాటితే రేషన్‌కార్డు క్యాన్సల్ అవుతుందంటా. రేషన్‌ను సకాలంలో ఇవ్వాలి.

- వెంకటలక్ష్మి, లబ్ధిదారు

2 కి.మీ. నుంచి వచ్చాం



మేమున్న కాలనీలో రెండు రోజులకే బియ్యం అయిపోయాయని డీలర్ చెప్పాడు. దీంతో పక్క కాలనీలో ఉన్న దుకాణం వద్దకు రెండు కిలో మీటర్లు నడుచుకుని వస్తున్నాం. నడవలేని వారు ఆటో బాడుగకు తీసుకుని వస్తున్నారు. ఏ కాలనీ వారికి అక్కడే అక్కడే రేషన్ ఇస్తే బాగుంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రత్నమ్మ, లబ్ధిదారు

15 వరకు రేషన్ ఇస్తాం

చౌక ధరల డిపోల ద్వారా 15వతేదీ వరకు సరుకులు పంపిణీ చేస్తాం. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఒకరోజే బియ్యం ఇస్తారని ప్రచారం చేయడంతో లబ్ధిదారులు గుంపులుగుంపులుగా ఎఫ్‌పీ షాపుల వద్దకు చేరుకుంటున్నారు. ప్రభుత్వం నుంచే ఈ కోటాలో కందిబేడలు తక్కువగా వచ్చాయి. వచ్చేనెల నుంచి పూర్తీ స్థాయిలో కంది బేడలు అందేలాచర్యలు తీసుకుంటాం.

- లక్ష్మీదేవి, సీఎస్‌డీటీ, ధర్మవరం

మహిళా సర్పంచ్‌కు న్యాయం

ఇంటి తాళం తొలగించిన అధికారులు



ఇంటిలోపలికి వెళ్లిన మహిళా సర్పంచ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లేపాక్షి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులతో అవస్థలు పడుతున్న మహిళా సర్పంచ్‌కు న్యాయం జరిగింది. లేపాక్షి మండలం శిరివరం గ్రామంలో మహిళా సర్పంచ్ నేత్రావతిని భర్త చనిపోయిన అనంతరం కుటుంబికులు వేధింపులకు గురిచేశారు. ఉమ్మడి ఆస్తి అయిన ఇంటిని అత్తా, మామలు స్వాధీనం చేసుకుని ఆమెను, పిల్లలను బయటకు నెట్టి తాళం వేశారు. ఈ సంఘటనను ఆంధ్రజ్యోతి దినపత్రిక శనివారం 'మహిళా సర్పంచ్‌కు అత్తింటి వేధింపులు' అన్న శీర్షిక ప్రచురించింది. దీనికి స్పందించిన డిప్యూటి తహసీల్దార్ కుమార్‌రెడ్డి, వీఆర్వో నాగరాజు శనివారం గ్రామానికి చేరుకున్నారు. విచారణ జరిపి పిత్రార్జితమైన ఉమ్మడి ఆస్తి ఇంటిని సమభాగాలుగా పంచుకోవాలని సూచించారు. తాళాన్ని పగులకొట్టి మహిళా సర్పంచ్ నేత్రావతి, పిల్లలను ఇంటిలోకి పంపించారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అత్తా, మామలు, కుటుంబ సభ్యులను హెచ్చరించారు. పిత్రార్జితమైన ఆస్తులను గ్రామ ప్రజల సమక్షంలో సమానంగా పంచుకోవాలని అధికారులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు అధికారుల మాటను గౌరవించి సమ్మతించారు. సర్పంచ్ నేత్రావతి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన 'శ్రీకృష్ణ కృప'



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న రత్నాకర్

పుట్టపర్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా భక్తులు శ్రీకృష్ణకృప పేరిట చేపట్టిన నాటిక భక్తులను అలరింపచేసింది. శనివారం ఉదయం సాయికుల్వంతు మందిరంలో వికలాంగులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ మూడు చక్రాల సైకిళ్లను, మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. అనంతరం భక్తులు భక్తీగీతాలాపన చేపట్టారు. సాయంత్రం సత్యసాయి యువత శ్రీకృష్ణ లీలపై నాటికను ప్రదర్శించారు. భగవంతుడు భక్తులకు ఎప్పుడూ వెంటే ఉంటాడని నాటిక ద్వారా తెలియజేశారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస పంచ సూత్రాలను పాటించే వారి జీవితం సంతోషంగా సాగుతుందంటూ నాటిక ద్వారా వివరించారు. రంగారెడ్డి జిల్లా సేవా దళ్ అధ్యక్షుడు యాదగిరిరావు జిల్లాలో చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. 522 గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు, పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వృద్ధులకు కంటి ఆపరేషన్లు నిర్వహించి అద్దాలు పంపిణీ చేశామన్నారు. దీనజనోద్ధరణ పేరిట 20 మంది అనాథలకు విద్యను అందిస్తున్నామన్నారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పాటలు పాడుతున్న భక్తులు

చరిత్రలో జరగని వేడుక: పరిటాల సునీత



ప్రతిజ్ఞ చేయిస్తున్న పరిటాల సునీత

రామగిరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఇలాంటి సమావేశాలు జరగలేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కుంటిమద్దీ ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. తాను కుంటిమద్దీ పాఠశాలలో ఏడో తరగతి పరీక్షలు రాశాననని, నాటి పరిస్థితుల కారణంగా ఉన్నత చదువులు చదవలేకపోయానని గుర్తు చేసుకున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాభివృద్ధికి ఎన్నో మార్పులు తీసుకువచ్చారని అన్నారు. కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతుగా రూ.లక్ష విరాళం ప్రకటించారు. హెచ్ఎం అనంత పద్మనాభులు, ఎంఈఓ శ్రీనివాసులు, ఎస్ఐ సుధాకర్ యాదవ్, టీడీపీ నాయకులు రంగయ్య, రామ్మూర్తినాయుడు, సుధాకర్, మారుతీప్రసాద్, అశోక్‌కుమార్, శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా అభివృద్ధి : కాలవ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

కణేకల్లు/రాయదుర్గం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను దేశం గర్వించేలా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. కణేకల్లు క్రాసింగ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, రాయదుర్గం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను ఏ స్థాయిలో ఉన్నాయో తల్లిదండ్రులు నేరుగా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకునేందుకు ఇలాంటి సమావేశాలు ఉపయోగపడతాయని అన్నారు. బడుగు బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీలు ఉన్నతస్థాయిలో ఎదిగేందుకు నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గురుకుల పాఠశాలలను ప్రారంభించారని అన్నారు. వీటిలో చదివిన ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అయ్యారని అన్నారు. రాయదుర్గం నియోజకవర్గానికి ఒక ట్రిపుల్ ఐటీ కళాశాలను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనాయుడు, చైర్మన్ రుద్రప్ప, ఎంఈఓలు లక్ష్మణ్ణ, భవానీశంకర్, నాగమణి, టీడీపీ పట్టణ అధ్యక్షులు పసుపులేటి నాగరాజు, సీఆర్‌పీలు రాజేష్, లక్ష్మీకాంత్, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, హనుమంతరెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో

మెగా పీటీఎం

తల్లిదండ్రులు, నాయకులు, అధికారుల రాకతో సందడి

ఆటపాటలతో అలరించిన చిన్నారులు

గురువులలో ఆనందం

విరాళాలను సమర్పించిన దాతలు..

ఉమ్మడి జిల్లాలోని 3799 పాఠశాలల్లో వేడుకలు



అక్షరాల సంక్రాంతి

బడి వరకూ మాత్రమే వచ్చే అమ్మ, నాన్న ఈసారి బడిలోకి వచ్చారు. 'ఎలా చదువుతున్నారు' అని గురువులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, నాయకులు, గురువులు చెప్పింది విన్నారు. ఆటపాటల్లో పాల్గొన్నారు. బహుమతులను అందుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3799 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో జరిగిన సంబరం ఇది. మునుపెన్నడూ లేని విధంగా.. సంక్రాంతి సంబరాలను తలపించేలా.. సరస్వతీమాత పులకించేలా జరిగిన వేడుక.



అనంతపురం నగరంలోని పొట్టిశ్రీరాములు పాఠశాలలో..

భవిష్యత్తుకు బాటలు వేయండి: శ్రావణి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణి శ్రీ

బుక్కరాయసముద్రం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాటలు వేయాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. సిద్దరాంపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకలలో మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చామని అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యాను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ప్రత్యేక అధికారి శ్రీదేవి, ఎంపీపీ సునీత, టీడీపీ నాయకులు శ్రీరామిరెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

అప్పుడప్పుడు బడికి రండి: జేసీ



మాట్లాడుతున్న జేసీ శివ నారాయణ శర్మ

అనంతపురం విద్య/రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు అప్పుడప్పుడు పాఠశాలలకు రావాలని, తమ పిల్లల ప్రగతి గురించి తెలుసుకోవాలని జేసీ శివనారాయణ శర్మ సూచించారు. అనంతపురం నగరంలోని రాజేంద్రమున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పైకి వచ్చానని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల సహా అన్నీ ఉచితంగా అందిస్తోందని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్డీఓ కేశవనాయుడు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మారాలి: దగ్గుపాటి



విద్యార్థులు బాగుపడాలనే ఉపాధ్యాయులు దండిస్తారని, వారిపై తల్లిదండ్రులు దండెత్తడం సరికాదని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. తపోవనం జడ్పీ ఉన్నత పాఠశాల, రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని అర్థం చేసుకుని మారాలని సూచించారు. దేశంలోనే మొట్టమొదటి సారి మెగా పీటీఎం నిర్వహిస్తున్నామని, సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. పూర్వ విద్యార్థులను ఏకం చేసి పాఠశాలల అభివృద్ధికి నిధులు సేకరించాలని హెచ్ఎంలకు సూచించారు. గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థ అధ్వాన్నంగా మారిందని, పాఠశాల స్థాయిలోనే గంజాయికి అలవాటు పడే దారుణమైన పరిస్థితులు చూశామని ఆవేదన వ్యక్తం చేశారు. తన వంతుగా రాజేంద్ర మున్సిపల్ స్కూల్‌కు రూ.50 వేలు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి తపోవనం పాఠశాల అభివృద్ధికి రూ.50వేలు అందజేశారు. వేడుకలలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఎంఈఓ వెంకటస్వామి, ఎస్ఎంసీ చైర్మన్ ఫక్కీరప్ప, తహసీల్దార్ హరికుమార్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు డిష్‌నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చొరవతో సంక్షేమ గురుకులాలు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



టేకులోడు గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మమేకమైన మంత్రి సవిత

చిలమత్తూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులకు వారధిగా ఉండేలా మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. టేకులోడు బాలిక గురుకుల పాఠశాలలో జరిగిన వేడుకలలో ఆమె పాల్గొన్నారు. ఎన్టీఆర్ చొరవతో బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల సంక్షేమ పాఠశాలలు ఆవిర్భవించాయని అన్నారు. తద్వారా ఎంతో మంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 107 బీసీ హాస్టళ్లలో 105 టీడీపీ హయాంలో ఏర్పాటు చేసినవే అని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఆగిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రూ.25 కోట్లు మంజూరు చేశారని అన్నారు. పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం అవసరమని అన్నారు. విద్యార్థులు నేరాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు మత్తుకు బానిసలయ్యారని అన్నారు. విద్యార్థినులు దేనికీ భయపడకూడదని, సమస్యలను ఎదుర్కొని నిలబడాలని సూచించారు. పదో తరగతిలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఫలితాలు సాధించి, ఎమ్మెల్యే బాలకృష్ణకు గిఫ్ట్‌గా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకులు రంగారెడ్డి, బేకరీ గంగాధర్, సోమశేఖర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విలువలతోనే రాణింపు: అశ్మిత్



యాడికి కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాడిపత్రి/యాడికి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యతోనే విద్యార్థులు ఉన్నతస్థాయిలో రాణించగలరని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి అన్నారు. యాడికి కేజీబీవీ, తాడిపత్రి శ్రీనివాసపురం ట్రిపుల్ ఎస్ పాఠశాలలో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. చదివిన పాఠశాలను, స్వగ్రామాలను మరచిపోకుండా వాటి అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషిచేయాలని అన్నారు. వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. యాడికి మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, మాజీ సర్పంచు విజయలక్ష్మి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు నాగలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు, ఎంఈఓ కాశప్ప, కేజీబీవీ ఎస్ఓ నిర్మల, తహసీల్దారు రజాక్‌వలి, ఎంఈఓ నాగరాజు, నాయకులు రామచంద్రారెడ్డి, అఖిల్, అరవింద నారాయణరెడ్డి, సంజీవపురం పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కారంతో ఎదగాలి: గుమ్మనూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని, సంస్కారవంతులుగా ఎదగాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. ఎస్జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేడుకలలో ఆయన పాల్గొన్నారు. కాలానికి అనుగుణంగా తల్లిదండ్రులు పిల్లల నడవడిని గమనించాలని సూచించారు. విద్యార్థులు తమ గురువులను గౌరవించాలని అన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన తల్లిదండ్రులకు బహుమతులను అందజేశారు. హెచ్ఎం గోపాల్ రెడ్డి, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, గుజరీ మహమ్మద్ ఖాజా, ఫజులు, పెంచలపాడు వెంకటేశులు, న్యాయవాది వెంకటేశులు, వాసగిరి మణికంఠ, వనగొంది విజయలక్ష్మి, కొలిమి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అందరిలో అంటే ఎలా అమ్మా?



అనంతపురం రాజేంద్ర నగరపాలిక పాఠశాలలో అందరూ సంతోషంగా ఉంటున్న సమయంలో ఈ బంగారు తల్లి ఎందుకు ఏడుస్తోందో తెలుసా..? 'బాగా చదవకుంటే ఎలా..?' అని అందరి ఎదుటా అమ్మ మందలించినందుకు..! స్నేహితుల నడుమ.. ఇలా అడగకూడదు కదమ్మా..! పదిమందిలో పొగడాలి.. ఏకాంతంలో హితవు పలకాలి..!

బాగా చదివితే బంగారు భవిష్యత్తు: ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిర రూరల్, డిసెంబరు 7: విద్యార్థులు బాగా చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. బుళ్ళసముద్రం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన పీటీఎంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాభివృద్ధి పట్ల శ్రద్ధ పెడుతున్నారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల విశ్రాంతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి ఎంఈఓలు భాస్కర్, టీడీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, లక్ష్మీనారాయణ,డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మాజీ సర్పంచు జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను ప్రోత్సహించండి: కందికుంట



కదిరి బాలికల ఉన్నతపాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కదిరి/నంబులపూలకుంట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సాంకేతిక పట్ల ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. కదిరిలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, నంబులపూలకుంట మండలం కమ్మగుట్టపల్లి మండల పరిషత్ పాఠశాలలో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. భవిష్యత్తు కృత్రిమ మేధస్సుదేనని, అందుకు అనుగుణంగా సాంకేతిక విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పాఠశాలలో తల్లిదండ్రులసమావేశం ప్రతినెలా క్రమం తప్పకుండా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేకుమార్ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వీఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణ, ఎంఇఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి, గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, హెచ్ఎంలు వెంకటాచలం, లియాఖత్, జయప్రతాప్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, కౌన్సిలర్ రంగారెడ్డి, రాజేంద్రనాయుడు, దండే రవిశంకర్, బాషా, హనుమంతురెడ్డి, రెడ్డెప్ప, ఉపాధ్యాయుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బడికి సక్రమంగా పంపండి: సింధూర



పెడపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్/ఓబుళదేవరచెరువు/నల్లమాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పిల్లలను పాఠశాలలకు సక్రమంగా పంపించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తల్లితండ్రులకు సూచించారు. పెడపల్లి జడ్పీఉన్నత పాఠశాల, ఓబుళదేవరచెరువు మండలం కొండకమర్ల ప్రభుత్వ ఉన్నతపాఠశాల, నల్లమాడ మండలంలోని రెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నతపాఠశాల, రామాపురం గురుకుల వసతి పాఠశాలలో నిర్వహించిన వేడుకలలో ఆమె పాల్గొన్నారు. బడికి సక్రమంగా పంపితే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. పిల్లల నడవడికపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు నిఘా వేయాలని, వారు వ్యసనాలబారిన పడకుండా చూడాలని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యాబివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తోందని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ బడ్జెట్లో విద్యకు రూ.29,904 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. కార్యక్రమాలలో ఎంఈఓలు సురేష్, రమణ, హెచ్ఎంలు జంషీద్‌బాషా, సుధారాణి, భాస్కర్, రమణి, స్కూల్ కమిటీ చైర్మన్‌లు రవి, బాబునాయక్, కూటమి నాయకులు సామకోటి ఆదినారాయణ, బొమ్మయ్య, శ్రీరాంనాయక్, నాగరాజు, జయచంద్ర, జాకీర్ అహమ్మద్, రాజారెడ్డి, జెరిపిటి అంజనప్ప, ఇర్షాద్, షాన్వాజ్, బడిశం రామాంజి, జయచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట: జేసీ

నల్లమాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఉన్నతస్థాయికి చేరాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల గురించి ఉపాధ్యాయులతో తరచూ మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వేమనారాయణ, సురేష్, డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ దాదాపీర్ పాల్గొన్నారు.

విలువలను పెంచండి: వెంకటశివుడు యాదవ్



గుత్తిలో మాట్లాడుతున్న వెంకటశివుడుయాదవ్

గుత్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో మానవీయ విలువలను పెంచాలని, వారికి మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమయం కేటాయించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ కోరారు. గుత్తి, గుత్తి ఆర్ఎస్ ప్రభుత్వ పాఠశాలలలో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. వేడుకలలో ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఎంఈఓ రవినాయక్, సీఐ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్, నారాయణ, ఎంకే చౌదరి, బద్రివలి పాల్గొన్నారు.



అమ్మ చేతి ముద్ద.. కమ్మగా..



చదివిన బడికి రాయల్ మురళి సాయం.. రూ.50 వేలు



బుజ్జోడి బుర్రలో ఏవేవో ప్రశ్నలు.. అక్కను అడుగుదామంటే.. లాంగ్వేజ్ ప్రాబ్లమ్..!



ఎప్పటికీ గుర్తుండిపోయేలా.. ఎమ్మెల్యే పరిటాల సునీత గోరు ముద్ద.. చిత్రాన్ని దాచుకో చిన్నారీ..!

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.35

అనంతపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 35తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 30, కనిష్ఠ ధర రూ. 20 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 40,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 19,200, సరాసరి రూ. 38,600తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 31 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బుక్కపట్నం, మడకశిర, పెనుకొండ, హిందూపురం, ధర్మవరం, కదిరి కేంద్రాల్లో మూడు నెలలపాటు ఉచితగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి అయిన యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించడంతోపాటు వారి నైపుణ్యాన్ని బట్టి ఇతర రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

క్రైం కార్నర్

చోరీ కేసు ఛేదింపు

బంగారు ఆభరణాలు రికవరీ

బ్యూటీషియనే నిందితురాలు

పామిడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో గత శుక్రవారం వివాహ వేడుకలో 38 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైన విషయం తెలిసిందే. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో సీఐ యుగంధర్ చోరీ వివరాలు వెల్లడించారు. ఫంక్షన్ హాల్లో మండలంలోని రామరాజుపల్లికి చెందిన విశ్వనాథరెడ్డి కుమార్తె వివాహ వేడుక జరుగుతోందని, అందులో పెళ్లికుమార్తె గదిలో ఉంచిన 38తులాల బంగారు వడ్డాణాలు చోరీకి గురయ్యాయని అన్నారు. దీంతో విశ్వనాథరెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. తాము సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టామన్నారు. పెళ్లి కుమార్తెకు మేకప్ వేయడానికి వచ్చిన బ్యూటీషియన్ స్థానిక జాతీయ రహదారిపై స్పీడు బ్రేకర్ల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. ఆమె చోరీకి పాల్పడినట్లు ఒప్పుకుందన్నారు. అనంతరం వడ్డాణాలను స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఇశ్రాయిల్, రామాంజనేయులు, కానిస్టేబుళ్లు రవీంద్ర, ఓబులేసు, నాగార్జున పాల్గొన్నారు.

అనుమానాస్పదరీతిలో వృద్ధుడి మృతి

● కేసు పరిధిపై రైల్వే, పట్టణ పోలీసుల మధ్య రచ్చ


నడిపి కంబగిరి (ఫైల్)

తాడిపత్రి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం అనుమానాస్పద రీతిలో నడిపి కంబగిరి (64) మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లికి చెందిన నడిపి కంబగిరి చిత్తూరులో ఒక గ్రానైట్ పరిశ్రమలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 1న పింఛన్ తీసుకొనేందుకు స్వగ్రామానికి వచ్చాడు. అనంతరం శనివారం చిత్తూరుకు వెళ్లేందుకు తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. కొంతసమయం తర్వాత ప్లాట్‌ఫారం చివరికి వెళ్లాడు. అక్కడే బ్యాగ్‌ను పెట్టుకొని కూర్చొన్నాడు. అయితే కొద్ది సేపటి తర్వాత ప్లాట్‌ఫాంకు కొంత దూరంలో నడిపి కంబగిరి శవమై కనిపించాడు. శరీరంపై రక్తగాయాలు కూడా ఉన్నాయి. ఎవరో కొట్టినట్లు శరీరంపై రక్తంతో కూడిన గాయాలు ఉండటంతో ఎవరైనా హత్యచేశారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మద్దమ్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరందరికి వివాహాలు అయ్యాయి.

కేసు కట్టడానికి రెండు గంటలు

రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం వద్ద మృతదేహం కనిపించడంతో రైల్వే పోలీసులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా ప్రదేశానికి చేరుకున్న పోలీసులు ఈ ప్రాంతం తమ పరిధిలోకి రాదని రైల్వేపోలీసులకు తెలియజేశారు. మాకు కూడా సంబంధం లేదని రైల్వే పోలీసులు పట్టణ పోలీసులతో సుమారు రెండుగంటలపాటు చర్చించారు. అంతసేపు మృతదేహం అక్కడే ఉంది. రైల్వేపోలీసులు చేతులు ఎత్తేయడంతో చివరికి పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరి ప్రదక్షిణ

- గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్రం చర్యలు
- ధర్తీ ఆబా జన్ జాతీయ ఉత్కర్ష్ గ్రామ అభియాన్ వర్తింపు
- విద్య, వైద్యం, జీవనోపాధుల మెరుగుకు శ్రీకారం
- జిల్లాలో ఐదు గ్రామాల ఎంపిక
- సమస్యలు గుర్తిస్తున్న అధికారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గిరిజనుల జీవనోపాధులు మెరుగు పరిచి, వారిని అభివృద్ధి చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ధర్తీ ఆబా జన్‌జాతీయ ఉత్కర్ష్ గ్రామ అభియాన్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా దేశ వ్యాప్తంగా అత్యంత వెనుకబడిన గ్రామాలను ఎంపిక చేసి అభివృద్ధి చేయనున్నారు. అందులో భాగంగా జిల్లాలోని ఐదు గ్రామాలను ఎంపిక చేశారు. శింగనమల మండలంలోని నాగులగుడ్డం, నాగులగుడ్డం తండా, గుంతకల్లు నియోజకవర్గంలోని గుండాల తండా, వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి చిన్న తండా, పెద్ద తండాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాల అభివృద్ధి బాధ్యతలను గిరిజన సంక్షేమశాఖకు అప్పగించారు. దీంతో ఆ శాఖాధికారులు ఇప్పటికే ఆయా గ్రామాల్లో సమస్యలను గుర్తించే పనిలో పడ్డారు.

చేపట్టబోయే పనులివే..

కేంద్రం ప్రవేశపెట్టిన ధర్తీ ఆబా జన్‌జాతీయ ఉత్కర్ష్ గ్రామ అభియాన్ పథకం ద్వారా 15 రకాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన గిరిజన సంక్షేమశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గిరిజన గ్రామాల్లో ఇళ్లు లేని గిరిజనులకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటారు. గృహాలకు విద్యుత్ కనెక్షన్లు, సోలార్ వంటి సౌకర్యాలు కల్పిస్తారు. గిరిజన గ్రామాల్లోని ప్రజలకు వైద్యం కోసం 1000 పేరుతో మొబైల్ సంచార వాహనాల ద్వారా మెడికల్ యూనిట్లను నిర్వహిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఆయా గ్రామాల జనాభాను బట్టి మినీ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. అటవీశాఖ భూముల్లో ఇంతకుముందే సాగులో ఉండి పట్టాలు కలిగిన గిరిజనులకు పలు రకాల పంటల పండించుకునేందుకు ప్రోత్సహించనున్నారు. గిరిజన గ్రామాల్లో సరైన రోడ్ల నిర్మాణం, అటవీహక్కుల చట్టం కింద ఎఫ్ఆర్‌ఏ కేంద్రాలు ఏర్పాటు, సికిల్ సెల్ వ్యాధి కలిగిన వారికి అవగాహన, సామర్థ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రతి ఇంటికి జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి కొళాయి కనెక్షన్లు, అవసరమైన చోట ఓవర్ హెడ్ ట్యాంకులు, పంపు సెట్ల నిర్మాణం, ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, సమగ్రశిక్షణ అభియాన్ కింద గిరిజన విద్యార్థులకు వసతిగృహాలు, టెలికామ్ సేవలు, చేతివృత్తులపై ఆధారపడి సరైన ఉపాధి లేక వలసలు పోతున్న గిరిజనులకు జీవనోపాధుల కింద గొర్రెల పెంపకం, డెయిరీల ఏర్పాటు, చేపల పెంపకం, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ వంటి సౌకర్యాలు కల్పించనున్నారు.

18 శాఖల సమన్వయంతో...

గిరిజన గ్రామాల అభివృద్ధికి జిల్లాలోని 18 ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసినట్లు గిరిజన సంక్షేమశాఖాధికారులు తెలిపారు. ఇందులో గృహనిర్మాణాలకు సంబంధించి హౌసింగ్, రోడ్ల నిర్మాణం కోసం పంచాయతీరాజ్, విద్యుత్ సౌకర్యం కోసం ఏపీఎస్‌పీడీసీఎల్, తాగునీటి కల్పన కోసం ఆర్‌డబ్ల్యూఎస్, సోలార్ ఎలక్ట్రిసిటీ కోసం నెడ్‌క్యాప్, ట్రాన్స్‌కో, వైద్యం కోసం డీఎంహెచ్‌ఓ, రేషన్ కార్డు పంపిణీ కోసం డీఎస్‌ఓ, అంగన్‌వాడీల నిర్మాణం కోసం ఐసీడీఎస్, ఎస్ఎస్ఏ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అవగాహన కోసం ఈఎంఆర్ఎస్, టెలికామ్ కోసం బీఎస్ఎన్ఎల్, స్కిల్ డెవలప్‌మెంట్, వ్యవసాయశాఖ, మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖ, డీపీఓ, టూరిజం, గిరిజన సంక్షేమశాఖలను సమన్వయం చేసుకొని ఏ ఏ అభివృద్ధికి సంబంధించి శాఖలు ఉంటాయో... ఆయా శాఖల ద్వారా పనులు నిర్వహించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

అభివృద్ధిపై దృష్టి సారించిన కలెక్టర్

గిరిజన గ్రామాల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే రెండుసార్లు 18 శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి వారికి దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా సంబంధిత శాఖాధికారులు సమస్యలను గుర్తించి ఆయా పనులు పూర్తిస్థాయిలో వేగవంతం చేయాలని సూచించారు. మరో వారంలో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి ఆయా గ్రామాలకు విడతల వారీగా పలు శాఖలను సమన్వయం చేసి పనులు కేటాయించనున్నట్లు సమాచారం.



గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం

ప్రపోజల్స్ పంపాం..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తీ ఆబా జన్‌జాతీయ ఉత్కర్ష్ గ్రామ అభియాన్ పథకం కింద జిల్లాలో ఐదు గ్రామాలు ఎంపికయ్యాయి. ఆయా గ్రామాలకు సంబంధించిన సమస్యలను వెలికితీస్తున్నాం. ఆయా సమస్యలను సంబంధింత శాఖలకు వివరిస్తున్నాం. దాదాపు 18 శాఖలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రపోజల్స్ పంపాం. వారి ఎస్టిమేషన్స్ వేసి మరోమారు జిల్లా కలెక్టర్ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఆ తరువాత పనులు మొదలవుతాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని శాఖల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.

- రామాంజనేయులు, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి

డీఎన్‌ఏ రిపోర్టులో ఏముందో..?

ఆ మృతదేహం రామాంజినమ్మదేనా...?

రెండు నెలల కిందట పశుసంవర్ధకశాఖ అటెండర్ అదృశ్యం



అనంతపురం క్రైం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): గత నెలలో లభ్యమైన ఓ మహిళ మృతదేహానికి సంబంధించి డీఎన్‌ఏ రిపోర్టులో ఏముందనే విషయం ప్రస్తుతం చర్చకు దారి తీస్తోంది. ఆ మృతదేహం రామాంజినమ్మదేనని ఆమెకు సంబంధించిన ఆనవాళ్లు బలం చేకూరుస్తున్నా, దానిపై పోలీసులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. పశుసంవర్ధక శాఖలో అటెండర్‌గా పనిచేస్తున్న రామాంజినమ్మ నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని లలితానగర్‌లో కొడుకు మోహన్‌రావుతో నివాసముండేది. అక్టోబరు 17న విధులకు వెళ్లిన ఆమె 18న ఉదయం నుంచి కనిపించకుండా పోయింది. అదే రోజు ఆమె హత్యకు గురైనట్లు సమాచారం. కాగా వివాహమై మరో ఊర్లో ఉంటున్న రామాంజినమ్మ కుమార్తె అశ్విని తన తల్లికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో విషయాన్ని సోదరుడు మోహన్‌రావుకు తెలియజేసింది. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న అతను హైదరాబాద్‌కు వెళ్లడంతో రావడం ఆలస్యమైంది. ఈ క్రమంలో ఆమె ఎక్కడ అదృశ్యమైంది, ఎక్కడ ఫిర్యాదు చేయాలనే విషయంలో వన్‌టౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లకు తిరిగారు. ఎట్టకేలకు అక్టోబరు 28న అనంతపురం రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఆ రోజే హత్య..?

తొలుత రూరల్ సీఐ శేఖర్ దర్యాప్తులో భాగంగా రామాంజినమ్మ కుమార్తె, కుమారుడుతో కలిసి ఇంటిని పరిశీలించారు. ఇంట్లో బీరువా పగలకొట్టి ఉండటం, సీసీ కెమెరా ధ్వంసం చేసి ఉండటం, రక్తపు మరకలున్న రోకలిబండ ఉండటం అనుమానాలకు తావిచ్చాయి. విచారణలో భాగంగా అనుమానితులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసులు కాల్ రికార్డింగ్ ఆధారంగా విచారిస్తే అసలు గుట్టు బయటపడింది. రామాంజినమ్మ ఉంటున్న ఇంటి ఎదురుగా కొంతకాలం ఓ ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఆ ఇంటిలో బేల్దారి పనిచేసే ఓ యువకుడితో రామాంజినమ్మకు పరిచయమైంది. ఆ పరిచయం సాన్నిహిత్యం మారినట్లు సమాచారం. ఈక్రమంలోనే ఆ యువకుడు మరో యువకుడితో కలిసి ఈ నెల 18న ఉదయం రామాంజినమ్మ ఇంటికి వెళ్లారు. ఇద్దరూ ఆమె పై దాడి చేసిననట్లు సమాచారం. ఆమె తలపై సుత్తితో మోదగా మృతి చెందింది. అనంతరం ఇంట్లోని బీరువాలో ఉన్న 4తులాల బంగారు నగలు, రూ.40వేల నగదు తీసుకెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో వచ్చి మృతదేహాన్ని బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో సీసీ కెమెరాలు పగలకొట్టారు. రాత్రి శవం మాయం చేశారు.

20 రోజుల తరువాత మృతదేహం లభ్యం

పోలీసులు పలు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు 20 రోజుల అనంతరం ఓ మహిళ మృతదేహం కనిపించింది. నవంబరు 8న రామాంజినమ్మ ఇంటి సమీపంలో ఖాళీ ప్రదేశం, ముళ్లకంపలున్న ప్రాంతంలో మృతదేహం లభ్యమైంది. చెత్తలో, అందులోనూ బండరాళ్ల కింద దాచిపెట్టడం, మూడువారాలు కావడంతో శవం దాదాపు అస్తిపంజరంగా మారింది. అయితే మృతదేహంపై ఉన్న చీర, ఇతర ఆనవాళ్ల మృతదేహం రామాంజినమ్మదే అని చెప్పాయి. కానీ నిర్ధారణ కావాల్సి ఉంది.

డీఎన్‌ఏ రిపోర్టుపై ఎస్పీ ఆరా

పోలీసులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం డీఎన్ఏ టెస్ట్ కోసం పంపారు. డీఎన్ఏ రిపోర్ట్ రావడానికి 15రోజులు లేదా నెలరోజుల సమయం పడుతుందంటారు. ఇప్పటికే నెలకావస్తోంది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా తాజాగా పోలీస్ అధికారుల సమీక్షలో రామాంజినమ్మ హత్యకేసు విషయం, డీఎన్ఏ రిపోర్ట్ పైనా ఎస్పీ ఆరా తీశారు. రిపోర్ట్ ఇంకా రాలేదా అని అడిగినట్లు తెలిసింది. డీఎన్ఏ రిపోర్టు ఆధారంగా ఆ మృతదేహం రామాంజినమ్మదే అని తేలితే కేసు, హత్యోదంతం బయటపడనుంది.

అక్రమ మద్యంపై కఠిన చర్యలు తీసుకోండి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య


మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం సరఫరా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. స్థానిక ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో శనివారం ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఏఈఎస్ రేవతితో కలిసి ఎక్సైజ్ సీఐలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా బెల్టుషాపులు ఏర్పాటు చేయకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహిస్తుంటే వాటిపై తక్షణమే దాడులు నిర్వహించి, నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమ మద్యం సరఫరా కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింతగా పెంచాలన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిబంధనల అతిక్రమణలపై చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేసిన తర్వాత తిరిగి అక్రమ మద్యం సరఫరాలో పట్టుబడిన 35 మందిని వారం రోజుల్లోగా తహసీల్దార్ వద్ద హాజరుపర్చి, బైండోవర్ అతిక్రమణ అపరాధ రుసుం చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో వారిని జైలుకు పంపాలన్నారు.

సార్..! మా భూమి ఇప్పించండి

ఆర్డీఓ కాళ్లు పట్టుకున్న బాధితులు

గాండ్లపెంట, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): సార్..! పేదోళ్లం. మీ కాళ్లు మొక్కుతాం. భూమి మాకు ఇప్పించండి అంటూ రైతులు ఆర్డీఓ వద్ద ప్రాధేయపడ్డారు. మండలంలోని కటారుపల్లి గ్రామానికి చెందిన గంగన్నకు 1978లో ప్రభుత్వం భూమి ఇచ్చినట్లుగా ఓ పత్రం ఉంది. దాన్ని తీసుకుని నెల రోజుల కిందట రెవెన్యూ అధికారులను సంప్రదించామని గంగన్న కుమారులు ఓబులేసు, వేమనారాయణ తెలిపారు. రెవెన్యూ అధికారులు కొట్లపల్లి పొలంలో 1482 సర్వేలోని ప్రభుత్వ భూమి 2.41ఎకరాలు సాగు చేసుకోవడానికి అనుమతించారని బాధితులు చెప్పారు. ఇటీవల ఆ భూమిపైకి వెళ్లి ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారన్నారు. తమ తండ్రి పేరున పట్టా ఉన్న భూమిని సాగు చేయనివ్వలేదన్నారు. ఈక్రమంలోనే గత రెండు రోజులుగా కుటుంబసభ్యులతో కలిసి గాండ్లపెంటలో దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఈవిషయం తెలుసుకున్న ఆర్డీఓ వీఎస్ శర్మ సంఘటనా స్థలానికి శనివారం వచ్చారు. బాధితులతో మాట్లాడారు., ఈసర్వే నెంబరులో వంక పోరంబోకు నిషేధిత భూములన్నారు. ఎవరికీ పట్టాలించేందుకు కుదరదని, గతంలో ఇచ్చిన పట్టా నకిలీదన్నారు. ఇలాంటివి చెల్లవని బాధితులకు ఆర్డీఓ తెలిపారు. దీంతో బాధితులు బోరున విలపిస్తూ తమ భూమిని ఇప్పించాలిని ఆర్డీఓను కాళ్లు పట్టుకున్నారు. ఇప్పటికే ఈ భూమి అభివృద్ధి కోసం రూ. 50వేలు ఖర్చు పెట్టామన్నారు. కూలికి పోతేనే పూటగడిచే మాలాంటి వారితో రెవెన్యూ అధికారులు ఆటలాడడం సరికాదన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురావు, సీనియర్ అసిస్టెంట్ జాఫర్, విఆర్‌ఓలు వెంకటరమణ, క్రిష్టప్ప, రామమోహన్, సర్వేయర్లు ఉన్నారు.

నేడు చం.స్పందన సభ

అనంతపురం కల్చరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో చం.స్పందన జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నట్లు స్పందన అనంత కవుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జిల్లాకు చెందిన సీనియర్ రచయిత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డిని 'చం. స్పందన జీవన సాఫల్య పురస్కారం' కోసం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించనున్న పురస్కార ప్రదానోత్సవ సభలో రాచపాళెంకు జీవన సాఫల్య పురస్కారంతోపాటు నగదు బహుమతి అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు.

973 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాలా ఇన్‌ఫ్లో 973 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ - 2కు 910 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

ఆకతాయిల దాడి.. ముగ్గురికి గాయాలు

తాడిపత్రి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణాపురం జీరో రోడ్డులో బాలికలను వేధిస్తున్నవారిని మందలించిందుకు ఆకతాయిలు దాడి చేశారు. దీంతో శంకర్, నాగేంద్ర, సుబ్బరాయుడు అనే ముగ్గురు గాయపడ్డారని సీఐ సాయిప్రసాద్ తెలిపారు. పట్టణానికి చెందిన భాస్కర్, అమర్, వరుణ్ తదితరులు ఈవ్ టీజింగ్ చేస్తుండగా, అక్కడే ఉన్న బేల్దారి శంకర్ మందలించాడు. అప్పటికి వెళ్లిపోయిన ఆకతాయిలు.. మరికొందరితో కలిసి వచ్చి శంకర్‌పై దాడి చేశారు. అక్కడే ఉన్న నాగేంద్ర, సుబ్బరాయుడు విడిపించడానికి వెళ్లడంతో వారిపైనా నాపరాళ్లతో దాడిచేశారు. దాడిలో శంకర్, సుబ్బరాయుడుకు స్వల్పగాయాలయ్యాయి. నాగేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగేంద్ర పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు.

యాడికిలో 16.5 తులాల బంగారం చోరీ

యాడికి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కమ్మవీధిలో 16.5తులాల బంగారం చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు మినుమనూరు వెంకటశివ తెలిపిన మేరకు వెంకటశివ భార్యతో కలిసి ఈనెల 1న ఇంటికి తాళాలు వేసి మంత్రాలయం వెళ్లాడు. 3న తిరిగి వచ్చాడు. ఇంటిలోని బీరువాలో చూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో చోరీ అయినట్లు గుర్తించి, విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే కేసు నమోదు చేయలేదు. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్న పోలీసులు కేసు నమోదు చేయడం లేదని బాధితుడు వాపోయాడు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


నరేష్ (ఫైల్ ఫొటో)

ఆత్మకూరు డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు గ్రామానికి చెందిన నరేష్(25) అప్పుల బాధ తాళలేక శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు నరేష్ తనకున్న ఐదెకరాల భూమిలో మామిడి చెట్లు సాగు చేశాడు. అంతర పంటగా వేరుశనగ సాగు చేసేవాడు. పంటల పెట్టుబడులు, కుటుంబ జీవనానికి అప్పులు చేశాడు. అయితే వీటని తీర్చే మార్గం కానరాక ఇంటికి సమీపాన చెట్టుకి ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గుర్తించి, పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఇతడికి భార్య, కుమార్తె ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రేపు అవగాహన సదస్సు

అనంతపురం రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అనంతపురం డివిజన్ ఆధ్వర్యంలో ఈనెల 9న ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సు, అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డివిజన్ ఈఈ జేవీ రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం మీటింగ్ హాల్‌లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు కార్యక్రమంలో జరుగుతుందన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ అధికారులు, సిబ్బంది అదాలత్‌కు హాజరవుతారన్నారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

అథ్లెటిక్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ చాంపియన్‌షిప్-2024 పోటీలు శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. పోటీలను ఎస్కేయూ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రాథమిక దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన క్రీడాపాలసీ బంగారు క్రీడాభవిష్యత్తుకు నాంది పలుకుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో మహిళా విభాగంలో 100మీటర్లలో మేఘన, 400మీటర్లలో పావని, 800మీటర్లలో వైష్ణవి, ఐదు కిలోమీటర్లలో రాజ్యలక్ష్మి, జావెలిన్‌త్రోలో వైష్ణవి, షాట్‌పుట్ మాలాశ్రీ, 4X100మీటర్ల రిలేలో ఎస్ఎస్‌బీఎన్, హిందూపురం ఎస్‌డీజీఎస్, ఎస్కేయూలు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందాయి. పురుషుల విభాగంలో 100మీటర్లలో చంద్రశేఖర్, 400మీటర్లలో విజయసాయి, సుభాష్, 800మీటర్లలో జయసాయి సుభాష్, 5 కిలోమీటర్ల గురురవితేజ, లాంగ్‌జంప్‌లో రవీంద్ర, జావిలిన్‌త్రో భరత్, షాట్‌పుట్‌లో భరత్, 4X100రిలేలో ఆర్ట్స్‌కాలేజీ, ఎస్కేయూ, ఎస్ఎస్‌బీఎన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీరామ్, అథ్లెటిక్ కోచ్‌లు మంజుల, సురేష్, పీడీలు జయరామప్ప, శ్రీనివాస్ నాయక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

హంద్రీనీవా విస్తరణ పనులు చేపట్టాలి

రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాలకు సాగు, తాగునీరు అందించే హంద్రీనీవా కాలవ కాంక్రీట్ లైనింగ్ పనులు ఆపి, కాలవ వెడల్పు పనులు చేపట్టాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ లైనింగ్ పనులు ఆపి, వెడల్పు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలో ఉన్న హంద్రీనీవా కార్యాలయం ఎదుట ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ గత ఎన్నిక సందర్భంగా హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచుతామని, అందుకు అనుగుణంగా వెడల్పు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఇందుకు విరుద్ధంగా జీడిపల్లి నుంచి కుప్పం వరకు కాంక్రీట్ లైనింగ్ పనులు చేపట్టేందుకు అనుమతివ్వడం దారుణమని మండిపడ్డారు. అనంతరం హంద్రీనీవా ఇన్‌చార్జి ఎస్ఈ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాప్తాడు సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా రైతుసంఘం కార్యనిర్వాహక కార్యదర్శి వన్నారెడ్డి, నాయకులు రాము, దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, అక్కులప్ప, రసూల్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి

జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో రెండు జిల్లాల అధికారులతో కోర్టులో శనివారం సమావేశం నిర్వహించారు. రాజీకి తగిన కేసులను ఎక్కువ సంఖ్యలో తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్, రెండు జిల్లాల ఎస్పీలు, మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.


జిల్లా న్యాయాధికారితో సమావేశమైన అధికారులు, న్యాయాధికారులు

న్యూస్ బాక్స్

ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి



ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇస్తున్న డీటీఎఫ్ నాయకులు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తెచ్చేలా చూడాలని డీటీఎఫ్ నాయకులు ఎమ్మెల్యే పల్లె సింధూరెడ్డికి వినతిపత్రం అందచేశారు. శనివారం మండలంలోని కొండకమర్లలో ఎమ్మెల్యేని కలిసి అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉపాధ్యాయుడు ఎజాజ్‌అహమ్మద్‌ను విద్యార్థులు చితకబాది ఆయనకు మరణానికి కారణమయ్యారన్నారు. ఆ కుటుంబానికి న్యాయం చేసి, ఉపాధ్యాయుడి మృతికి కారకులైన వారిని శిక్షించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి సోముశేఖర్ నాయక్, నాగరాజు, సిద్దయ్య పాల్గొన్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో శనివారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ మల్లికార్జునరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ప్రోత్సాహం అందిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. ఆర్డీటీ అధికారి శ్రీరామ్‌నాయక్ మాట్లాడుతూ దివ్యాంగుల చట్టాలను మరింత కఠినతరం చేయాలన్నారు. వారికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజులనాయుడు, సంఘం సభ్యులు గంగాదేవి, సీసీ చంద్రారెడ్డి, వెంకటరమణ, ఆర్డీటీ సిబ్బంది నాగరాజు, గీతా, దివ్యాంగుల సంక్షేమసంఘం నాయకులు బోగొట్టి గజేంద్ర, రెడ్డెప్ప, జయలక్ష్మి పాల్గొన్నారు.

యజమాన్య పద్ధతులపై శిక్షణ



సిబ్బందికి సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

కదిరి అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కదిరి డివిజన్‌లోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి సామర్థ్యాల పెంపుపై శనివారం వ్యవసాయ పరిశోధన కేంద్రాంలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు హాజరై మాట్లాడుతూ ఎన్‌పీఎస్ఎస్, సీఏఎస్ యాప్ ద్వారా తప్పకుండా రైతులకు పంటలపై సోకే చీడపీడల నివారణకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానంలో పండించే పంటల సాగుపై అవగాహన కల్పించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రాలతో శాస్త్రవేత్తలు పంటలకు సోకేతెగుళ్లు, చీడపీడల గురించి వివరించారు. ఏపీఎంఐపీ పీడీ సనావుల్లా, ఏడీఏ సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారులు, ఆర్ఎస్‌కే సిబ్బంది, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

వంటగదికి రేకుల షెడ్డు ఏర్పాటు చేస్తాం



సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు

ముదిగుబ్బ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో వంటగది లేక ఎండ, వానకు ఇబ్బందులు పడుతున్నామని ఏజెన్సీ నిర్వాహకులు టీడీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, ఉత్తమ నాయుడు సొంత నిధులతో రేకులషెడ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో పాఠశాల విద్యార్థులకు బట్టలు వితరణ చేసిన బాసినేని ప్రభాకర్, గోవిందమ్మ దంపతులకు ఇతర దాతలకు సన్మానించారు. ఎంఈఓ రమణప్ప, పాఠశాల హెచ్ఎం నాయుడు, రామాంజి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బి.రామసూరారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కుటాగుళ్ల వద్ద రైల్వే పనులు జరుగుతుండడంతో మండలవ్యాప్తంగా ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

తాడిమర్రి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ క్రిష్ణవేణి సూచించారు. కునుకుంట్లలోని ఉన్నతపాఠశాలలో సైబర్ నేరాలు, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలు మీ దృష్టికి వస్తే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. డ్రగ్స్ గురించి అయితే 1972కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ క్రిష్ణవేణి

పిల్లలను మంచి మార్గంలో నడిపించాలి

● తల్లిదండ్రుల సమావేశంలో వక్తలు

● పండుగ వాతావరణంలో బడిలో వేడుకలు

ధర్మవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం వారిని మంచిమార్గంలో నడిపించాలని 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు, పాఠశాల హెచ్ఎం నాగప్ప అన్నారు. పట్టణంలో అన్ని ప్రభుత్వ ప్రాథమిక,ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని పండుగ వాతావరణంలో శనివారం నిర్వహించారు. అనంతరం ఆటలపోటీలు, ముగ్గులపోటీలు నిర్వహించారు.

కదిరి అర్బన్: మండలంలోని పట్నం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. హెచ్ఎం లక్ష్మీదేవి, స్కూల్ కమిటీ అధ్యక్షులు వీర ప్రకాష్ మాట్లాడుతూ అందరికి విద్య మన బాధ్యత అని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాచేపట్టిన ఈకార్యక్రమం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నడం సంతోషమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులుపాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాఠశాల హెచ్ఎం నాగప్ప

తాడిమర్రి: తల్లిదండ్రులు వారిపిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎంసీ చైర్‌పర్సన్ క్రిష్ణవేణి, ఎంఈఓలు క్రిష్ణమోహన్, వెంకటేశ్వర్లు సూచించారు. తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం శనివారం స్థానిక ఉన్నతపాఠశాల ఆవరణంలో నిర్వహించారు. సర్పంచ్ బాలమ్మ, హెచ్ఎం అరుణ పాల్గొన్నారు.

తనకల్లు: విద్యార్థుల తల్లిదండ్రులు ఒక అడుగు పాఠశాల వైపు వేయాలని వక్తలు కోరారు. శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో మేగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణి, ఎస్ఐ గోపి, డాక్టర్ లోకేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఖాదర్‌వలీ, టీడీపీ మండల కన్వీనర్ తొట్లిరెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: కలిసికట్టుగా మత్తు రహిత సమాజాన్ని స్థాపించాల్సిన అవసరం ఉందని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, ఎంఈఓ సురేష్‌బాబు, హెచ్ఎం శోభారాణి పాల్గొన్నారు.

బుక్కపట్నం: పిల్లలకు మంచి చదువు రావాలంటే ఉపాధ్యాయులకంటే



బుక్కపట్నంలో మాట్లాడుతున్న కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు



కదిరి: పట్నం పాఠశాలలో బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్ఎం

ఎక్కువ బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఎంఈఓ గోపాల్‌నాయక్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల పాఠశాలతోపాటు మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. మాజీ సర్పంచ్ సాకే యశోద, మైనార్టీ సయ్యద్‌బాషా, గోపాలపురం గంగాధర్ పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిచారు.ఈ సందర్భంగా విద్యార్థుల అబివృద్ది కోసం తల్లిదండ్రులతో చర్చించి సలహాలు చూచనలు చేశారు.విద్యాలు పాఠశాల నుంచి ఇల్లకు వచ్చిన తరువాత తల్లిదండ్రు ప్రత్యేకయ శ్రద్ద తీసుకోవాలన్నరు.సీఐ ప్రభాకర్ కస్తురిబా గాందీ బాలికల పాఠశాలలో పాల్గొని తల్లిదండ్రలకు మాదకద్రవ్యాల పై అవగాహన కల్పించారు.

ముదిగుబ్బ: మత్తు పదార్థాలకు బానిస కావద్దని సీఐ శివరాముడు సూచించారు. స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతోఏర్పాటుచేసిన సమావేశం నిర్వహించారు.

గాండ్లపెంట: మండలవా ్యప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పలు పాఠశాలలో తల్లిదండ్రులు, విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. అలాగే స్థానిక కస్తూరిబా పాఠశాలకు, గాండ్లపెంట ఉన్న పాఠశాలకు సీఐ నాగేంద్ర హాజరైయ్యారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్కూల్ ఛైర్మన్లు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయండి

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని ఎనుమలపల్లి గ్రామపొలంలో సర్వేనెంబరు 26-1ఏలో అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్ రద్దుచేయాలని బాధితులు సబ్‌రిజిస్ట్రార్‌కు ఫిర్యాదుచేశారు. శనివారం ఎనుమలపల్లికి చెందిన పోతల రంగప్ప మాట్లాడుతూ సర్వేనెంబరు 26-1ఏలో 2.16 ఎకరాల భూమి మా తాతగారి పేరుమీద ఉమ్మడి ఆస్తి ఉండగా 9 మంది అన్నదమ్ములు కలసి తమ్ముడి కుమారుడైన బాలాజీపేరుపై 2015లో జీపీఏ చేశామన్నారు. అయితే ఎవరికీ తెలియకుండా 2018లో 40 సెంట్లు



ఫిర్యాదును చూపుతున్న పోతుల రంగప్ప

భూమిని కొందరు విక్రయించారని రంగప్ప ఆరోపించారు. అనంతరం 2020లో జీపీఏ చేసి ఇచ్చినవారిలో పోతల కేశప్ప మరిణించగా అంతటితో జీపీఏ రద్దైన విషయాన్ని గోప్యంగా ఉంచి 2023లో క్రయవిక్రయాలు జరిపారన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో బాలాజీ అందరూ బతికే ఉన్నారని సెల్ఫ్ అఫిడవిట్ ఇచ్చాడన్నారు, కొనుగోలుదారులు అమ్మకందారులు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కావడంతో అధికారులను మోసం చేసి క్రయవిక్రయాలు జరిపారన్నారు. తమకు చెప్పకుండా క్రయవిక్రయాలు జరిపిన జీపీఏను రద్దుచేసి, అక్రమ రిజిస్ట్రేషన్‌లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

భవిష్యత్తు యువతదే



విద్యార్థులతో మహిళాపారిశ్రామిక వేత్తలు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆధునిక భవిష్యత్తు యువతదేనని థండర్‌సాఫ్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్‌ప్రెసిడెంట్ సుధారాణిపిళ్లై అన్నారు. శనివారం బీడుపల్లి సంస్కృతిగ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ నిర్వహించిన 4.0 యుగంలో అబివృద్ధి చెందుతున్న దేశంలో మహిళల పాత్ర కార్యక్రమంలో పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. పిళ్లై మాట్లాడుతూ ఈవెంట్ కెరీర్, కెరీర్‌మార్గాలను ఊహించడం, పారిశ్రామికరంగంలో మహిళల పరివర్తన ప్రభావాన్ని, భవిష్యత్తును రూపొందించడం తదితర అర్థవంతమైన చర్చలను నిర్వహించారు. విభిన్నరంగాలలో మహిళల అత్యుత్తమ నైపుణ్యాలను, అంకితభావం ఆవిష్కరణలపై వక్తలు వివరించారు. కార్యక్రమంలో బెంగళూరు అపరేషనల్ ఎక్సలెన్సు యూనివర్సిటీ హెచ్ఓడీ రీతూశర్మ, యూనివర్సిటీ రిలేషన్స్ అకడమిక్ పార్ట్‌నర్ పాలో అల్టో అకాడమీ ప్రతినిధి రేష్మినెబంపిల్లి, యాక్సెంచర్ ప్రాజెక్టు మేనేజర్ సిందునాథయ్య, అసిస్టెంట్ వైస్‌ప్రెసిడెంట్ ఎఫ్‌పీ ఏ సింక్రోని, అలేఖ్య, సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డీన్ బాలకోటేశ్వరి పాల్గొన్నారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ మేళాపై ర్యాలీ

ధర్మవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి పోస్టాఫీసులో 11, 12 తేదీలలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్‌ఇన్సూరెన్స్‌పై ప్రత్యేక మేళాను నిర్వహిస్తున్నట్లు హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం పోస్టల్ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్పీఎల్ఐని 1995 సంవత్సరంలో ప్రవేశపెట్టిందన్నారు. ఈ పాలసీని 19 నుంచి 55 సంవత్సరాల వయస్సున్న వారు పొందవచ్చన్నారు. రూ.10వేల నుంచి రూ.10లక్షల వరకు తీసుకోవచ్చన్నారు. గ్రామీణప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరూ ఈ పాలసీని తీసుకోవడానికి అర్హులన్నారు. ప్రభుత్వంవారు పీఎల్ఐ పాలసీని 1884 సంవత్సరంలో ప్రవేశపెట్టిందన్నారు. పీఎల్ఐని రూ.20వేల నుంచి రూ.50లక్షలు వరకు పొందవచ్చన్నారు. డాక్టర్‌లు, లాయర్లు, ఇంజనీర్లు, ఐటీఐ, పాలిటెక్నిక్ చేసినవారు ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న వారు అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు ఈ స్కీమ్‌లో చేరవచ్చొన్నారు. ఇన్సురెన్స్‌లు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తోందని, వాటికి భద్రత కూడా ఉంటాయన్నారు. ఐపీఓ రాజేశ్, పోస్టుమాస్టర్ సంతోష్, సిబ్బంది బుద్దన్న పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ వరప్రసాద్

ధర్మవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎన్‌బీ ఫంక్షన్‌హాల్ సమీపంలో శనివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేపట్టినట్టు ఆర్టీఓ వరప్రసాద్ తెలిపారు. పట్టణంలోకి వచ్చిపోయే వాహనాలను ఆర్టీఓ ఆపి రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో చట్ట విరుద్ధంగా రవాణా చేస్తున్న నాలుగు వాహనాలపై కేసు నమోదు చేసి రూ.48వేలు జరిమానా విధించినట్టు ఆయన తెలిపారు. మోటారు వాహనాల రెన్యువల్ చేసుకున్నారా లేదా కాలం తీరిన వాహనాలు ఉన్నాయా అన్నది ఆర్టీఓ విచారించారు. వాహనాలు కండిషనల్లోలేక పోతే జరిగే అనర్థాలపై డ్రైవర్లకు సూచించారు.

దాతలకు ఘన సన్మానం



దేవళం తండాలో దాతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తనకల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళం తండా పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి వివిధరకాలుగా సహకారించిన దాతలను సన్మానించారు. ఎస్వీయూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రెడ్డెప్ప, వందేమాతరం టీమ్ సభ్యులు బాగేపల్లి చలపతి, పాఠశాల ఉపాధ్యాయుడు శివశంకర్‌లను సన్మానించారు. కమిటీ ఛైర్మన్ జల్ల రవి, హెచ్ఎం అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనుషులు కలిపే మధ్యవర్తిత్వ చట్టం

● ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుంది

● న్యాయాధికారులు ప్రతిమ, మీనాక్షిసుందరి

కదిరిలీగల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వివాదాల్లో ఇరుక్కుని విడిపోయిన మనుషలను మధ్యవర్తిత్వ చట్టం ద్వారా కలుసుకునే అవకాశం ఉందని న్యాయాధికారులు ఎస్ ప్రతిమ, పీ మీనాక్షి సుందరి అన్నారు. శనివారం మధ్యవర్తిత్వ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న న్యాయాధికారులు మాట్లాడుతూ మధ్యవర్తిత్వ చట్టం ఆవశ్యకతను వివరించారు. కేసులు పరిష్కారం కాక ఏళ్ల తరబడి వ్యయప్రయాసలు, ఆర్థిక ఇబ్బందులకు లోనయ్యే పరిస్థితుల్లో మధ్యవర్తిత్వ చట్టం ద్వారా ఉపశమనం పొందవచ్చన్నారు. మధ్యవర్తిత్వం నిర్వహించే వ్యక్తి తటస్తుడుగా కలివిడిగా ఇరువర్గాల మనోభావాలు గాయపరచకుండా వ్యవహరించే వ్యక్తిగా ఉండాలన్నారు. తన బుద్ధికుశలతతో సమస్యను ఇరువర్గాలు పరిష్కరించుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే విధంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. మధ్యవర్తి ద్వారా పరిష్కరించిన సమస్య ఒప్పంద పత్రం ద్వారా కోర్టుకు ఇచ్చిన తరువాత డిక్రీ పత్రంగా పొందగలుగుతారని అన్నారు. ఇరువర్గాల ఆమోదంతోనే సమస్య పరిష్కరమవుతుందన్నారు. తిరిగి సమస్యలు తలెత్తే ప్రసక్తే ఉండదన్నారు. మధ్యవర్తి చట్టం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడగలదని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేందర్‌రెడ్డి, సురేంద్రచౌదరి, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి ప్రతిమ

అయ్యప్ప రథోత్సవ పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లిబండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో 16 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే అయ్యప్ప నవరాత్రి రథోత్సవ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సహకార సంఘం బ్యాంక్ మేనేజర్ వెంకటాచలం, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయలనాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ 16నుంచి 24వరకు నవరాత్రుల సందర్భంగా మదగజ, పులి, అశ్వం, హంస, మయూరం, గరుడ, నాగసర్పం, కామదేనువు, సూర్యప్రభ వాహనాలపై స్వామిని పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. 25వ తేదీన స్వామి వారి మహారథోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు వాసుదేవరెడ్డి, బాలప్ప, వెంకటరమణ, ఆలయ సేవకులు ఎస్‌బీఐ శీను, గ్రైలర్ నిజాం, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎస్కేయూ హాకీ జట్టుకు సాయిదినేష్ ఎంపిక



పుట్టపర్తిరూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ హాకీ జట్టుకు సాయిదినేష్ ఎంపికైనట్లు మంగళకర ఎడ్యుకేషనల్ ట్రస్టీ సురేష్‌కుమార్ తెలిపారు. ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని మద్రాస్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ పోటీల్లో విద్యార్థి పాల్గొంటారని ఆయన తెలిపారు. మండలంలోని జగరాజుపల్లి మంగళకర డిగ్రీకళాశాలలో సాయి దినేష్ బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. మంగళకర విద్యాసంస్థల కరస్పాండెంట్ మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్‌ట్రస్టీ ఆర్యప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ రమేష్‌బాబు, పీడీ శ్రీనివాసులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థినిని అభినందించారు.

నిందితుడికి రిమాండ్

నల్లమాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్నికోటకు చెందిన రాజశేఖర్‌ను రస్తా గొడవ విషయంలో రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ దాదాపీర్ శనివారం తెలిపారు. నాలుగురోజులక్రితం రస్తా విషయంలో వారాధి, రాజశేఖరులు గొడవపడ్డారు. వారాధి ఫిర్యాదు మేరకు రాజశేఖర్‌పై కేసు నమోదు చేసి, కదిరి కోర్టుకు రిమాండ్‌కు పంపామన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు కర్ణాటక నాగేపల్లిలో దాడులు నిర్వహించి 10 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. దాడుల్లో ఎస్సై ఉమామనోహర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సౌండ్ సిస్టమ్ పరికరాల చోరీ

నల్లమాడ , డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని షాదీమహల్‌లో సౌండ్ సిస్టమ్ పరికరాలు శుక్రవారం రాత్రి చోరీకి గురైనట్లు యజమానులు షాకీర్‌బాషా, సురేష్, సాయి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ రాత్రి ఎవరూ లేని సమయంలో సౌండ్ సిస్టమ్స్, మిక్సర్ బోర్డు, యాపిల్‌ఫైర్స్ రెండు చోరీకి గురయ్యాయన్నారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు

పెనుకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పరవక్కరిబావి ఒడ్డున వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మొదటి షష్ఠి వేడుకల ను ఘనంగా నిర్వహించారు. శనివారం వేడుకలను పురస్కరించుకుని ఆ లయ అర్చకులు శేషప్పస్వామి, వేదబ్రహ్మ పంచాంగం నాగప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి ప్రార్థన, మహన్యాస పూర్వక ఏకాదశ వా ర రుద్రాభిషేకం, నవగ్రహ సుబ్రమణ్యేశ్వర మూలమంత్రసహిత రుద్రస్వాహాకార హోమం, రతాంగహోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి, కార్యక్రమాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ని ర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి 24వ రథోత్సవ కార్యక్రమాన్ని ని ర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు ప్రసాద వినియోగం, బ్రాహ్మణ అన్నసంతర్పణ నిర్వహించారు.

అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

మడకశిరటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మడకశిర పట్టణ సమీపంలోని అగ్రికల్చర్ డిప్లొమా కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అధ్యాపకుడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మడకశిర పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అధ్యాపకుడిని సస్పెండ్ చేయడంతోపాటు పోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ తక్షణమే స్పందించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కళాశాలకు వచ్చి జరిగిన సంఘటనపై ఆందోళనకు దిగినా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సునీల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆత్మీయ సమావేశాలు

● తరలి వచ్చిన తల్లిదండ్రులు
● పాఠశాలల్లో పండుగ వాతావరణం
● పీటీఎం విజయవంతం






హిందూపురంలో మాట్లాడుతున్న ఎంఈఓ గంగప్ప, గోరంట్లలో బహుమతులు అందచేస్తున్న ఆర్డీఓ సువర్ణ, మడకశిరలో పాల్గొన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,పెనుకొండ మండలంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

(న్యూస్ నెట్‌వర్క్ - ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు విజయవంతమయ్యాయి. కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాలల్లో పండుగ వాతావరణం కనిపించింది. తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పాఠశాల కమిటీ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి వారి అభిప్రాయాలు, సూచనలు సేకరించారు. హిందూపురంలోని ఎంజీఎం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, ఎంఈఓ గంగప్ప, వన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే ఉన్నస్థాయికి చేరతారని పేర్కొన్నారు. యుఎవత పెడదోవ పట్టకుండా ఉండాలంటే తల్లిదండ్రులే కీలకం అన్నారు. టీచర్లతో పాటు ఎప్పటికప్పుడు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలన్నారు. గోరంట్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బాలుర ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమానికి పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్, ప్రధానోపాధ్యాయుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు. బాలికోన్నత పాఠశాలలో ఎంఈఓలు జానొరెడ్డెప్ప, గోపాల్, హెచ్‌ఎం మాధవిలత ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. పెనుకొండ మండలపరిధిలోని వెంకటరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఆనందమ్మ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పాఠశాల కమిటీ చైర్మన్ రవీంద్రరెడ్డి, కౌన్సిలర్ సప్తగిరి పాల్గొన్నారు. పాఠశాలలకు విద్యాభివృద్ధి కోసం విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ పెద్ద పీట వేస్తున్నారని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య పేర్కొన్నారు. వెంకటగిరిపాళ్యం, గుట్టూరు, చంద్రగిరి గ్రామాల్లో మెగా పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ చైర్మన్‌లు మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మావటూరు జడ్పీహెచ్ఎస్‌లో నాగరాజు 12 కుర్చీలు వితరణ చేశారు. పరిగి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కృపాసత్యరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు తాడులాగే పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, నాయకులు గోవిందరెడ్డి, స్కూల్ చైర్మన్ అశ్వర్థ పాల్గొన్నారు. లేపాక్షి మండల వ్యాప్తంగా పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. మడకశిర పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ఆదిరెడ్డిపాళ్యం ప్రాథమిక పాఠశాలతోపాటు ప్రభుత్వ పాఠశాలలన్నింటిలోనూ అహ్లాదకరంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శకుంతలమ్మ, ఎంజేబీ గురుకుల బాలుర ప్రిన్సిపాల్ ఫణీంద్ర పాల్గొన్నారు. రొళ్ల గురుకుల పాఠశాలలో కమిటీ చైర్‌పర్సన్ సుమ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్, ప్రిన్సిపాల్ మైలారప్ప పాల్గొన్నారు. గుడిబండ మండలంలో తల్లిదండ్రుల ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవిందప్ప, పాండురంగప్ప, రామ్మూర్తి, శశికళ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అమరాపురం మండల పరిధిలోని ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత, మండల పరిషత్ పాఠశాలలు, కేజీబీవీ ఆదర్శ పాఠశాల, అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించినట్లు విద్యాధికారులు రాఘవయ్య, వెంకటరమణ నాయక్ తెలిపారు. అగళి మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, మోడల్ స్కూల్, ఇనగలూరు, ఇరిగేపల్లి, పి.బ్యాడిగెర, మధుడి, ఉన్నత పాఠశాలతోపాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పీటీఎం నిర్వహించారు. తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు, తాడు లాగేపోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్, ఎంఈఓ -2 చంద్రశేఖర్ బహుమతులు అందజేశారు.

సంక్షిప్తం

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఖాతాదారులకు సూచనలు ఇస్తున్న బ్యాంక్ అధికారులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు అధికమయ్యాయని, ఖాతాదారులఅ ప్రమత్తంగా ఉండాలని అమరావతి స్టేట్‌బ్యాంక్ -3 నెట్‌వర్క్ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని సర్వశెట్టి ఫంక్షన్‌హాల్‌లో ఎస్‌బీఐ ఖాతాదారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్‌ఫోన్లకు ఓటీపీ చెప్పాలని సందేశాలు వస్తుంటాయని, వాటితో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఖాతాదారులకు బ్యాంక్ సిబ్బంది ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించాలన్నారు. టోల్‌ఫ్రీ నంబరు 18001234ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్‌కుమార్ గొలాటి, కర్నూలు ఏఆ శశిధర్‌కుమార్, చీఫ్ మేనేజర్ మహేష్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఉపకార వేతన పరీక్షలు

పెనుకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పెనుకొండ పట్టణంలో నాలుగు కేంద్రాల్లో ఆదివారం ఉదయం జాతీయ ఉపకార వేతన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1, బాలికల ఉన్నత పాఠశాలలో 2 కేంద్రాలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1 కేంద్రాన్ని మొత్తం నాలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

పెనుకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌వీఆర్ మల్టి స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 2గంటల వరకు ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. శిబిరంలో గుండెనొప్పి, చాతినొప్పి, ఆయాసం, కళ్లుతిరగడం, గుండెలోమంట, చాతిలో బరువుగా ఉండటం, నిద్రలో ఆయాసం వచ్చి లేచి కూర్చోవడం, కాళ్లవాపు, చమటలు పట్టడం, తదితర రోగాలకు పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తామన్నారు.

చేపల చెరువులు వేలం

గుడిబండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరికెర పంచాయతీ రాజబండచెరువు, హిరేతుర్పి చెరువు, రాళ్లపల్లి చెరువులను వేలం వేసినట్లు పంచాయతీ కార్యదర్శులు పరిపూర్ణాచారి, దాదాఖలందర్ తెలిపారు. శనివారం ఆయా పంచాయతీ కార్యాలయాల ఆవరణంలో నాలుగు చెరువులను వేలం వేయగా రూ.3.35 లక్షలు వేలంపాట దారులు పాడి వేలంపాటదారులు దక్కించుకొన్నారు. కరికెర చెరువు రూ.1లక్ష, రాజబండ చెరువు రూ.45వేలు, హిరేతుర్పి చెరువు రూ.35వేలు, రాళ్లపల్లి చెరువు రూ.1.53లక్షలకు వేలంపాట పాడినట్లు వారు తెలిపారు. ఈఓఆర్డీ నాగరాజునాయక్, సర్పంచులు లక్ష్మీనారాయణ, గౌరమ్మల ఆధ్వర్యంలో వేలం వేసినట్లు తెలిపారు.

ఎస్‌ఐని సన్మానించిన టీడీపీ నాయకులు

గుడిబండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నూతన ఎస్‌ఐ రాజకుళ్లాయప్పను టీడీపీ నాయకులు సన్మానించారు. శనివారం టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు శివకుమార్, లక్ష్మీనరసప్ప, షబ్బీర్, భీమరాజు, శ్రీరామ్, తదితరులు వెళ్లి నూతన ఎస్‌ఐను కలిసి శాలువా కప్పి పూలహారాలతో ఘనంగా సన్మానించారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని ఇస్తున్న భజనబృందం సభ్యులు

గోరంట్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కస్తూరి రంగనాథస్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక భజనబృందం సభ్యులు రూ.50,116 విరాళాన్ని అందచేశారు. శనివారం వానవోలుకు చెందిన భజన బృందం వారు ప్రజల కోరికమేరకు వెళ్లి కార్యక్రమాల్లో భజనలు నిర్వహిస్తుంటారు. భజన చేసినందుకు నిర్వాహకులిచ్చే సంభావనలో కొత్త మొత్తం విహార యాత్రకు వెళ్లడం కోసం దాచి ఉంచారు. గ్రామంలోని పురాతన ఆలయాన్ని పునరుద్ధరించాలని నూతన ఆలయం కోసం గ్రామస్థులు పూనుకున్నారు. ఆలయ నిర్మాణం కోసం వారు తమ వద్ద దాచి ఉంచుకున్న మొత్తాన్ని అర్చకులు శ్రీధర్, ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో భజన బృందం నాయకులు శంకరప్ప, నరసింహప్ప, శ్రీనివాసులు, లక్ష్మీదేవమ్మ, లక్ష్మీనారాయణ, దండోరా నారాయణ, బాబు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు భూమిపూజ

పావగడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు సీసీ రోడ్లు, ప్రధాన రోడ్లకు అనుసంధానం కల్గించే విధంగా సీఎస్ఆర్ నిధుల కింద రూ.12కోట్ల నిధులతో రాయచెర్లు, బళసముద్రం, తిరుమణి ప్రాంతాల్లో ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్ శనివారం భూమి పూజ చేశారు. సోలార్ పార్కు నిర్మాణంతో ఈప్రాంతం ప్రజలకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు ప్రధాన రోడ్లకు అనుసంధానమయ్యేలా గ్రామీణ రోడ్లు రవాణా సౌకర్యం కల్పించడం గర్వకారణం అని ఎమ్మెల్యే అన్నారు. వచ్చే మార్చి నాటికల్లా నాణ్యమైన రోడ్లు వేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేష్, నాని, శంకర్‌రెడ్డి, రవి, పీడబ్ల్యుడీ అనీల్, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్‌ఐ

గుడిబండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మద్యం, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప సూచించారు. శనివారం గుడిబండ మండలంలోని పి.సి.గిరి ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండి మంచి పేరు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. యువత మద్యం వ్యసనాలకు బానిసై తమజీవితాలను నాశనం చేసుకోవద్దని హితబోధ చేశారు. చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగితే కీర్తిప్రతిష్టలు పెరుగుతాయన్నారు. సమాజంలో కూడా గౌరవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించండి

జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ



న్యాయవాదులతో చర్చిస్తున్న న్యాయాధికారి

హిందూపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో అందుకు అనుగుణంగా మధ్యవర్తిత్వంపై కక్షిదారుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ న్యాయవాదులకు సూచించారు. శనివారం కోర్టు ఆవరణంలో న్యాయవాదులతో ఏడీజే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని, దీనిపై పూర్తీ స్థాయిలో నిరీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్తులో మధ్యవర్తిత్వం కీలకంగా మారనుందన్నారు. ఇప్పటి నుంచే సీనియర్ న్యాయవాదులు అవగాహన కల్పించుకుని కేసుల్లో ఉన్న ఇరువర్గాల కక్షిదారులను సమస్యపై ప్రశాంత వాతావరణంలో రాజీమార్గం ద్వారా న్యాయవాదులు మధ్యవర్తిత్వం వహించాలన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సైతం మధ్యవర్తిత్వంపై ప్రత్యేక దృష్టిసారించి న్యాయవాదులకు ప్రత్యేక శిక్షణ సైతం ఇస్తుందన్నారు. ఇలాంటి శిక్షణలకు న్యాయవాదులు తప్పనిసరిగా హాజరై అవగాహన కల్పించుకోవాలన్నారు. ముఖ్యంగా సివిల్ తగాదాలపై మధ్యవర్తిత్వం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. న్యాయవాదులు దరఖాస్తు చేసుకుంటే శిక్షణకు పంపుతామని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ఏపీపీ ఇందాద్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, సత్యనారాయణ, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలు




ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ఊరేగుతున్న దృశ్యం

పెనుకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పరవక్కరిబావి ఒడ్డున వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మొదటి షష్ఠి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం వేడుకలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు శేషప్పస్వామి, వేదబ్రహ్మ పంచాంగం నాగప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి ప్రార్థన, మహన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకం, నవగ్రహ సుబ్రమణ్యేశ్వర మూలమంత్రసహిత రుద్ర స్వాహాకార హోమం, రతాంగహోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి, కార్యక్రమాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి 24వ రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు ప్రసాద వినియోగం, బ్రాహ్మణ అన్నసంతర్పణ నిర్వహించారు.

సైనిక సంక్షేమానికి విరాళాలు ఇవ్వండి : కలెక్టర్



విరాళం అందజేస్తున్న కలెక్టర్ చేతన్

చిలమత్తూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మన దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు, దేశ రక్షణలో అనునిత్యం పాల్గొంటున్న సైనికులు, మాజీ సైనికుల కోసం ఉదారంగా విరాళాలు అందివ్వాలని కలెక్టర్ చేతన్ పిలుపునిచ్చారు. శనివారం కోడూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయుధ పతాక దినోత్సవం సందర్భంగా సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప ఆధ్వర్యంలో పలువురు కలెక్టర్‌ని కలిశారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కి సైనిక సంక్షేమ శాఖ రూపొందించిన స్టిక్కర్‌ని అందజేశారు. విద్యార్థులకు పంపిణీ చేసిన హుండి బాక్స్ ద్వారా సాయుధ దళాల పతాక నిధికి విరాళాలను సేకరించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సాయుధ దళాలలో పనిచేస్తున్న సైనికులకు సంఘీభావాన్ని ప్రకటించి మాజీ సైనికులకు పునరావాస కార్యక్రమంలో అమరులైన వీరు జవాన్లకు, వితంతువులకు వారి కుటుంబ సభ్యులకు అండగా ఉండాలన్నారు.

అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి: ఎస్‌ఎఫ్‌ఐ



అమరాపురం బస్టాండులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మడకశిరటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మడకశిర పట్టణ సమీపంలోని అగ్రికల్చర్ డిప్లొమా కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అధ్యాపకుడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మడకశిర పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అధ్యాపకుడిని సస్పెండ్ చేయడంతోపాటు పోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ తక్షణమే స్పందించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కళాశాలకు వచ్చి జరిగిన సంఘటనపై ఆందోళనకు దిగినా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సునీల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ ప్రాజెక్టులపై చిన్నచూపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో రాయలసీమ ప్రాజెక్టులకు అన్యాయం జరిగిందని ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిద్దేశ్వరం అలుగు ప్రాజెక్టుపై శ్రద్ధ ఉంచి వాటికి నీరందిస్తే రాయలసీమకు ప్రతి ఎకరాకు నీరందుతుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అమరావతిపైనే ఎక్కువ దృష్టి పెట్టిందన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌తో మూడు నెలలు మాత్రమే అరకొర నీరు అందుతుందన్నారు. నదులు అనుసంధానం చేసి వెనుకబడిన సీమ ప్రాంతానికి నీరందిస్తే ప్రజల కష్టాలు తీరుతాయని తెలిపారు. అమరావతి, పోలవరం అభివృద్ధి మంచిపనే అయినా సీమ అభివృద్ధికి కూడా సహకరించాలన్నారు. పెన్నా జయమంగలి నదుల నీరు వృథాగా ఏటి పాలు కాకుండా పందిపర్తి వద్ద కొండల నడుమ రిజర్వాయర్ నిర్మించి కాలువల ద్వారా నీరు తరలించాలని డిమాండ్ చేశారు. కరువు కాటకాలతో వలసలు ఎక్కువగా ఉన్నాయని వాటిని ఆపాలంటే ప్రాజెక్టులతోపాటు నీటి అవసరాలు తీర్చాలన్నారు. ఇప్పటికే ప్రతి జిల్లాలోను మేధావుల సదస్సులు జరుగుతున్నాయని హిందూపురంలో పెద్ద స్థాయిలో జనవరిలో మేధావులు సదస్సు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ ఐక్యవేదిక నాయకులు శ్రీనివాసులు, మున్నా, నౌషద్, శంకర్, షౌకత్, అల్తాఫ్ తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు అండగా నిలవాలని వైసీపీ నుంచి నియోజకవర్గం వ్యాప్తంగా టీడీపీలోకి వలసలు పెరుగుతున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. శనివారం బాలాజీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆమిదాలగొంది పంచాయతీకి చెందిన పది కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. వైసీపీ నాయకులు మల్లేశప్ప, బాలచంద్ర, వరదరాజులు, నాగిరెడ్డి, రవి, సుబ్బరాయప్ప, నరసప్ప, దాసప్పలతోపాటు పలువురు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. వారికి గుండుమల తిప్పేస్వామి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ల రంగేగౌడ్, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

గోరంట్ల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన రైతుల నుంచి నాసిన్, బెల్ ఏయిర్ బస్సు ఏర్పాటు కోసం భూములను సేకరించిన 165 మందికి వెంటనే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని భూనిర్వాసితులు పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణకు శనివారం వినతి పత్రం అందచేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా భూనిర్వాసితులకు పునరావాస చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకోసం పలుమార్లు అభ్యర్థిస్తున్నా న్యాయం జరగలేదంటూ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి వారు గోరంట్ల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవోను కలిశారు. నష్టపరిహారం చెల్లింపుల్లో వ్యత్యాసాలున్నాయని, న్యాయం చేయాలన్నారు. తమకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లునిర్మించాలని కోరారు. ఇందుకు సంబంధించిన ఫైల్ ప్రభుత్వం పరిశీలనలో ఉందని, బడ్జెట్ అనుమతులు వచ్చిన వెంటనే సమస్య పరిష్కారం అవుతుందని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సాకే వెంకటేష్‌లు, కొండా వెంకటేష్‌లు పాల్గొన్నారు.

బీమాతో ధీమాగా ఉండండి

హిందూపురం అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): 'బీమా చేయండి ధీమాగా ఉండండి' అని పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, హెడ్ పోస్ట్ మాస్టర్ మార్కండేయులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో పోస్టల్ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి వ్యక్తికి వ్యక్తిగత బీమా చాలా అవసరమన్నారు. ఇంతకు ముందు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే బీమా ఇచ్చేవారని, ఇప్పుడు ప్రభుత్వం కొన్ని అవకాశాలు కల్పించిందని తెలిపారు. ఉద్యోగులు, ప్రైవేట్ టీచర్లు, వైద్యులు, లాయర్లు, ఇంజనీర్లు, తదితరులు ఈ ఇన్‌సూరెన్స్ చేయించుకోవచ్చన్నారు. ఈ నెల 11, 12వ తేదీల్లో మహా ఇన్సూరెన్స్ మేలా నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కలికా కేంద్రాలతో విద్యార్థులకు ఊరట



కలికా పుస్తకాలను అవిష్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

పావగడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యలో వెనకబడిన విద్యార్థులకు కలికా కేంద్రాల ద్వారా ఎంతో ఊరట లభిస్తుందని జిల్లా పంచాయతీ సీఈఓ ప్రభు తెలిపారు. శనివారం పళవళ్లిలో ఉన్న అంబేడ్కర్ వసతి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం పదో తరగతిలో 35 శాతం మాత్రమే ఉత్తీర్ణులయ్యారని, జిల్లాలోనే విద్యలో వెనకబడిన తాలూకాగా ముద్ర పడిందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఈవిషయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని విద్యార్థులకు సమయాపాలన, క్రమశిక్షణ తెలియపర్చాల్సిన అవసరం ఉందని సూచించారు. తాలూకా వ్యాప్తంగా పది కలికా కేంద్రాలు ఏర్పాటు చేసి శని, ఆదివారాల్లో విద్యార్థులకు సమర్పక సేవా ట్రస్టు ద్వారా సిబ్బందిని ఏర్పాటు చేసి పాఠాలు బోధించేందుకు ముందుకు రావడం ఎంతో గర్వకారణం అని మధుగిరి డీడీపీఐ గిరిజ తెలిపారు. కార్యక్రమంలో బీఈఓ ఇంద్రాణమ్మ, ఈఓ జానకిరాం, ట్రస్టు అధ్యక్షుడు రాజన్న, పాఠశాల ప్రిన్సిపాల్ లతా, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.